క్లుప్తంగా

నడక నానీల పుస్తకం ఆవిష్కరణ



నడక నానీల పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి రోజా

అమలాపురం టౌన్: అమలాపురానికి చెందిన శ్రీశ్రీ కళా వేదిక జిల్లా అధ్యక్షుడు, నడక కవి నల్లా నరసింహమూర్తి రచించిన తన 100వ నడక నానీల పుస్తకాన్ని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి ఆర్కే రోజా విజయవాడలోని టూరిజం పార్కులో జరిగిన మహాకవి బోయి భీమన్న జయంతి సభలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర సాహిత్య అకాడమీ చైర్‌పర్సన్ పిల్లంగోళ్ల శ్రీలక్ష్మి, మహాకవి బోయి భీమన్న సతీమణి హైమావతి, శ్రీశ్రీ కళా వేదిక జాతీయ చైర్మన్, కవి డాక్టర్ కత్తిమండ ప్రతాప్‌లు మాట్లాడుతూ నరసింహమూర్తి రాస్తున్న చైతన్య అక్షరాలు నడక ప్రియులకు మార్గదర్శకాలుగా నిలుస్తున్నాయన్నారు.

ఇస్కాన్‌కు కేటాయించిన స్థలం అప్పగింత



ఇస్కాన్‌కు కేటాయించిన స్థలాన్ని పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్ నుపూర్ అజయ్

అమలాపురం టౌన్: అమలాపురం శివారు రావులచెరువు జనుపల్లె రోడ్డులో రాజమహేంద్రవరం ఇస్కాన్ సెంటరుకు అనుబంధంగా నిర్మించనున్న టెంపుల్, తదితర కట్టడాల కోసం ప్రభుత్వం కేటాయించిన 54 సెంట్ల స్థలాన్ని ఇస్కాన్ అమలాపురం ఇన్‌చార్జి శివానంద నిమయిదాస్‌కు మంగళవారం అప్పగించారు. జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.నుపూర్ అజయ్ ఆ స్థలాన్ని సందర్శించి సర్వే సిబ్బంది ద్వారా సరిహద్దులు నిర్ణయించారు. కార్యక్రమంలో తహసీల్దార్ పరమట శ్రీపల్లవి, రాజమహేంద్రవరం ఇస్కాన్ చైర్మన్ శ్యామంగ శ్రీనివాస దాస్, కార్యదర్శి హేమ నిమయిదాస్, సర్పంచ్ జి.భారతి, సానబోయిన వీరభద్రరావు పాల్గొన్నారు.

వీఆర్‌కు పట్టణ సీఐ దుర్గా శేఖర్‌రెడ్డి

అమలాపురం టౌన్: అమలాపురం పట్టణ సీఐ డి.దుర్గా శేఖర్‌రెడ్డిని వీఆర్‌లోకి పంపించారు. ఈ మేరకు ఏలూరు రేంజ్ డీఐజీ అశోక్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. ఏలూరు రేంజ్ కార్యాలయంలో రిపోర్ట్ చేయాలని ఆదేశించారు. అడ్మినిస్ట్రేషన్ గ్రౌండ్స్‌లో ఆయనను వీఆర్‌లో పెట్టినట్లు చెబుతున్నా ఇటీవల ఈదరపల్లిలో రౌడీషీటర్ హత్యకు దారి తీసిన పరిణామాలు సైతం దీనికి కారణమన్న చర్చ పోలీస్‌శాఖలో సాగుతోంది. అమలాపురం రూరల్ సీఐ పి.వీరబాబును పట్టణ ఇన్‌చార్జి సీఐగా నియమిస్తూ జిల్లా ఎస్పీ సుసరాపు శ్రీధర్ ఉత్తర్వులిచ్చారు.

ఓడలరేవు సేవాదళం ఆర్థిక వితరణ

అల్లవరం: మండలంలోని ఓడలరేవులో కరెంట్ స్తంభం నుంచి జారిపడి వెన్నెముక ఆపరేషన్ అనంతరం ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న నాగాబత్తుల శ్రీనుకి ఓడలరేవు సేవాదళం సభ్యులు రూ.13,800 ఆర్థిక సాయాన్ని మంగళవారం అందజేశారు.

నేడు అభిప్రాయ సేకరణ

యానాం: యానాం, పుదుచ్చేరి, మాహే, కారైకల్ మున్సిపాలిటీలు, కమ్యూన్ పంచాయతీల్లో, వార్డుల్లో ఓబీసీ రిజర్వేషన్ అమలుపై పుదుచ్చేరి ప్రభుత్వం నియమించిన జస్టిస్ కేకే శశిధరన్ కమిషన్ బుధవారం ఆయా వర్గాలతో సమావేశం కానుంది. స్థానిక ఎస్ఆర్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం ఉదయం 11 గంటలకు సమావేశం జరుగుతుందని విశ్రాంత డిస్ట్రిక్ట్ జడ్జి, ప్రత్యేక అధికారి రామబత్తిరన్ తెలిపారు.

ఎస్సీ వర్గీకరణ బిల్లు కోసం మానవహారం

అమలాపురం టౌన్: ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలని డిమాండ్ చేస్తూ మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి(ఎమ్మార్పీఎస్), మహాజన సోషలిస్ట్ పార్టీ(ఎంఎస్పీ) జిల్లా శాఖల ఆధ్వర్యంలో స్థానిక నల్ల వంతెన సెంటరులో సోమవారం మానవహారం ద్వారా నిరసన వ్యక్తం చేశారు. జిల్లా ఎమ్మార్పీఎస్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఆకుమర్తి మోహన్, ఎంఎస్పీ జిల్లా ఇన్‌చార్జి వల్లూరి సత్తిబాబు, యార్లగడ్డ సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ నిరసన దీక్ష

ఉప్పలగుప్తం: మండల కేంద్రంలోని బాలయోగి పార్కులో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు సత్తాల దుర్గారావు ఆధ్వర్యంలో నాయకులు మంగళవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ప్రస్తుత పార్లమెంటు సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలని కోరారు. కార్యక్రమంలో తొత్తరమూడి బాబులు, రాంబాబు పాల్గొన్నారు.

అమలాపురం రూరల్: ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టాలని డిమాండ్ చేస్తూ జిల్లా కలెక్టరేట్ వద్ద ఎమ్మార్పీఎస్ నాయకులు నిరసన దీక్ష చేశారు. నల్లవంతెన వద్ద మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో వల్లూరు సత్తిబాబు, సవరపు భైరవమూర్తి, మోహన్ పాల్గొన్నారు.

ముమ్మిడివరం: పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశ పెట్టాలని డిమాండ్ చేస్తూ ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ ఆధ్వర్యంలో ముమ్మిడివరంలో రిలే నిరాహార దీక్షలు చేపట్టారు.



బండారులంకలో ఏర్పాటుచేసిన గజాననుడి విగ్రహం



ఉప్పలగుప్తం మండలం గొల్లవిల్లిలో నిలిపిన వినాయకుని విగ్రహం



యానాం పాతబస్టాండ్ వద్ద ఏర్పాటు చేసిన గణనాథుని విగ్రహం



అమలాపురం గడియారం స్తంభం సెంటరులో విశేష అలంకరణలో...



యానాంలో స్వీట్‌తో తయారుచేసిన గణనాథుని విగ్రహం

వినాయక.. బహు రూపాయ..

- వాడవాడలా కొలువుదీరిన గణనాథులు
- ఘనంగా వినాయక చవితి వేడుకలు

అమలాపురం రూరల్/అమలాపురం టౌన్/ ఉప్పలగుప్తం/ఐ.పోలవరం/యానాం/తాళ్లరేవు/అల్లవరం/ముమ్మిడివరం: విఘ్నాలు తొలగించి విజయాలను ప్రసాదించే ఆదిదేవుడు వినాయకుడు బహురూపాల్లో భక్తులను కనువిందు చేశాడు. గణపతి నవరాత్ర వేడుకల్లో భాగంగా వాడవాడలా ఏర్పాటు చేసిన మండపాల్లో గజాననుని భారీ విగ్రహాలను కొలువుదీర్చిన భక్తులు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేస్తున్నారు. వినాయక మండపాలను విద్యుత్ వెలుగులతో సుందరీకరించారు. చిన్నా, పెద్దా తారతమ్యాలు లేకుండా వేడుకలను అట్టహాసంగా నిర్వహించారు. వినాయకచవితి సందర్భంగా విఘ్నాలు తొలగించే విఘ్నేశ్వరుడిని భక్తులు భక్తి శ్రద్ధలతో కొలిచారు. పలు ఆలయాల్లో భారీ అన్న సమారాధనలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

ఊరూరా ఉండ్రాలయ్య వేడుకలు

● అమలాపురం పట్టణంలోని గడియారం స్తంభం సెంటరులోని లక్ష్మీ గణపతి ఆలయం వద్ద చలువ పందిరి, ముమ్మిడివరం గేటు సెంటరులోని షరాబుల పందిరి, కూరగాయల మార్కెట్‌లోని పందిర వద్ద వినాయక చవితి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ మూడు చోట్ల పందిళ్లకు భారీ సెట్టింగ్‌లు ఏర్పాటు చేయడంతో ఆ పందిళ్లను తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. షరాబులు, మార్కెట్ పందిళ్ల వద్ద సోమవారం రాత్రి ఏర్పాటైన కోలాట ప్రదర్శనలు భక్తులను ఆకట్టుకున్నాయి.



మురమళ్ల మాణిక్యాంబ నగర్‌లో గణపతిని కొలుస్తున్న భక్తులు

● ఉప్పలగుప్తం మండలం గొల్లవిల్లిలో నిలిపిన వినాయకుని విగ్రహం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

● యానాం పిల్లారాయవీధిలోని శ్రీలక్ష్మీగణపతి ఆలయం, కనకాలపేట ఆలయాల్లో వినాయకుడికి ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ సతీమణి లక్ష్మీ స్నేహ, ఆమె తండ్రి మేడపాటి ధర్మారెడ్డి, ఎమ్మెల్యే అశోక్ తల్లి భారతి పూజలు చేశారు.

● గణపతి నవరాత్ర మహోత్సవాల్లో భాగంగా స్థానిక పిళ్లెయ్యార్ స్వామి(లక్ష్మీగణపతి) ఆలయం వద్ద కాపు ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి హంస వాహనోత్సవం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా స్వామిని హంస వాహనంపై పురవీధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రకాశం, నల్లా వెంకన్న, నల్లం నాగబాబు, జయరామ్ తదితరులు పాల్గొన్నారు.

● యానాంలోని స్థానిక శివాలయం వీధిలో గ్రంధి కృష్ణ సుధాకర్, రమాదేవి వైష్ణవిల కుమారుడు సాయిజతిన్ స్వీట్‌తో తయారుచేసిన వినాయకుని విగ్రహం అందరినీ ఆకట్టుకుంది.

● తాళ్లరేవు మండలంలోని జాతీయ రహదారి 216లోని సుంకరపాలెం బైపాస్ జంక్షన్‌లో శ్రీలక్ష్మీ వరసిద్ధి వినాయక వర్తక సంఘం ఆధ్వర్యంలో నవరాత్ర ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. తాళ్లరేవు గాంధీనగర్‌లో నందివాహనంపై వేంచేసియున్న వినాయక విగ్రహం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. తాళ్లరేవు కేశవస్వామి బైపాస్ కాలనీలో చిన్నారులందరూ కలిసి వినాయక విగ్రహాన్ని ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

● అల్లవరం మండలం మొగళ్లమూరులోని వరసిద్ధి వినాయకస్వామి వారి ఆలయంలో నవరాత్రుల ప్రాణ ప్రతిష్ఠ, కలశస్థాపన, సహస్ర బిల్వార్చన, కుంకుమార్చన ఘనంగా నిర్వహించారు. దేవగుప్తంలోని శ్రీలక్ష్మీ గణపతి ఆలయంలో స్వామివారి కలశస్థాపన వైభవంగా జరిపారు.

● అమలాపురం రూరల్ మండలంలో సీతారామ లక్ష్మణ ఆంజనేయ స్వామి వారి ఆలయ సన్నిధిలోని వరసిద్ధి వినాయక స్వామి వారి నవరాత్ర మహోత్సవాలను కలశ స్థాపనతో ప్రారంభించారు. 10 అడుగుల భారీ వినాయక విగ్రహాన్ని ప్రతిష్ఠించి పూజలు నిర్వహించారు. మండలంలోని బండారులంక వేంకటేశ్వర స్వామి మందిరం వద్ద అట్టలు, కాగితాలతో తయారు చేసిన 10 అడుగుల గణపతి ప్రతిరూపం అందరినీ ఆకట్టుకుంది.

● ఐ.పోలవరం మండలం మురమళ్ల మాణిక్యాంబ నగర్‌లో గణపతి నవరాత్రులు అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. మండలంలోని టి.కొత్తపల్లి, జి.వేమవరం, పశువుల్లంక, కేశనకుర్రు, ఐ.పోలవరం, పాతయింజరం, కొమరగిరి, గుత్తినదీవి, జి.మూలపాలెం, భైరవపాలెం, గోగుళ్లంక తదితర గ్రామాల్లో చవితి ఉత్సవాలు అంబరాన్ని తాకాయి. మురమళ్ల శ్రీభద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి ఆలయంలో కొలువైన గణపతికి బుధవారం లక్ష గరిక పూజా మహోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ పెన్మత్స కామరాజు, ఈఓ మాచిరాజు లక్ష్మీనారాయణలు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు.

● ముమ్మిడివరం మార్కెట్ సెంటర్ వర్తక సంఘం ఆధ్వర్యంలో శ్రీలక్ష్మీగణపతి ఆలయం, బళ్లగేటు సెంటర్ త్రిముఖ గణపతి ఆలయాల్లో గణపతి నవరాత్ర మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు.

బోయి భీమన్న రచనలతో సామాజిక చైతన్యం

అమలాపురం టౌన్: మహాకవి బోయి భీమన్న తన రచనలతో సామాజిక చైతన్యాన్ని తీసుకొచ్చారని మున్సిపల్ వైస్ చైర్మన్ రుద్రరాజు నానిరాజు అన్నారు. స్థానిక కూచిమంచి అగ్రహారంలో శ్రీశ్రీ కళా వేదిక జిల్లా శాఖ ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన బోయి భీమన్న జయంతి సభలో నానిరాజు మాట్లాడారు. ఈ సందర్భంగా కవితల పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వేదిక జిల్లా అధ్యక్షుడు నల్లా నరసింహమూర్తి, కవి బీవీవీ సత్యనారాయణ, సినీ నటుడు గుర్రం రామకృష్ణారావు, పీఎఫ్ విశ్రాంత అసిస్టెంట్ కమిషనర్ అద్దంకి అమరేశ్వరరావు, కవి మాకే బాలార్జున సత్యనారాయణ, కడలి సత్యనారాయణ, జల్లి సుజాత తదితరులు పాల్గొన్నారు.

అమలాపురంలో పౌష్టికాహార మాసోత్సవాలు

అమలాపురం టౌన్: పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) అమలాపురం సిటీ మిషన్ మేనేజర్ వి.రామలక్ష్మి ఆధ్వర్యంలో జాతీయ పౌష్టికాహార మాసోత్సవాలు మంగళవారం జరిగాయి. ఈ సందర్భంగా పట్టణ మహిళా సమాఖ్య మహిళలు చేపట్టిన పౌష్టికాహార అవగాహన ర్యాలీని మున్సిపల్ కమిషనర్ ఒమ్మి అయ్యప్పనాయుడు జెండా ఊపి ప్రారంభించారు. ర్యాలీ మున్సిపల్ కార్యాలయం ప్రాంగణం మెప్మా భవనం నుంచి గడియారం స్తంభం సెంటరు వరకూ సాగింది. ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సీడీపీవో కేవీఎల్‌డీ కుమారి మహిళలు ఎలాంటి పౌష్టికాహారం ఏఏ సమయాల్లో తీసుకోవాలన్న అంశంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాము శ్యామల,మెప్మా, ఐసీడీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

దాబాల్లో అధికారుల తనిఖీలు

తాళ్లరేవు: మండల పరిధిలోని సుంకరపాలెం జంక్షన్‌లో ఉన్న పలు దాబాల్లో ఫుడ్ సేఫ్టీ అధికారులు మంగళవారం తనిఖీలు నిర్వహించారు. కాకినాడ డివిజన్ ఫుడ్ అసిస్టెంట్ కంట్రోలర్ బి.శ్రీనివాస్ ఆదేశాల మేరకు ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ కేవీ సుబ్బారావు తనిఖీలు నిర్వహించి శాంపిల్స్‌ను సేకరించారు. శాంపిల్స్‌ను ల్యాబ్‌కు పంపనున్నట్టు సుబ్బారావు విలేకర్లకు తెలిపారు.

మండపాల భద్రత బాధ్యత కమిటీలదే

- డీఎస్పీ ఎం.అంబికా ప్రసాద్

అమలాపురం టౌన్: వినాయక చలువ పందిళ్లు, మండపాల వద్ద భద్రతా ఏర్పాట్లు చేసుకునే బాధ్యత ఆ ఉత్సవాల నిర్వాహక కమిటీ ప్రతినిధులదేనని అమలాపురం డీఎస్పీ ఎం.అంబికా ప్రసాద్ స్పష్టం చేశారు. రోజూ రాత్రి సమయాల్లో కమిటీకి చెందిన కనీసం ఇద్దరు ప్రతినిధులు మండపాల వద్ద ఉండాలని సూచించారు. స్థానిక శ్రీ సత్యసాయి కల్యాణ మండపంలో వినాయక ఉత్సవాల కమిటీల ప్రతినిధులతో మంగళవారం ఏర్పాటుచేసిన అవగాహన సమావేశంలో డీఎస్పీ మాట్లాడారు. పందిళ్లు, మండపాల వద్ద బాణసంచా కాల్పులు ఉండకూడదన్నారు. ముఖ్యంగా ఉత్సవాల చివరి రోజున నిర్వహించే గణేష్ నిమజ్జనోత్సవాలను, ఊరేగింపులను కమిటీల ప్రతినిధులు అత్యంత అప్రమత్తంగా నిర్వహించాలని సూచించారు. నిమజ్జనానికి పోలీసుల నుంచి ముందస్తుగా పొందిన అనుమతుల ప్రకారం మార్గం, సమయం, నిమజ్జనం చేసే ప్రదేశం వంటి విషయాల్లో ఎలాంటి మార్పులు ఉండకూడదని చెప్పారు. నిమజ్జన ఊరేగింపుల్లో అసభ్య ప్రదర్శనలు, విపరీత శబ్దాన్ని ఇచ్చే డీజేలకు అనుమతి లేదన్నారు. మద్యం సేవించిన వారు నిమజ్జనంలో పాల్గొనకుండా కమిటీలు జాగ్రత్తలు తీసుకోవాలని డీఎస్పీ అంబికా ప్రసాద్ సూచించారు. అవగాహన సమావేశంలో అమలాపురం పట్టణ ఇన్‌చార్జి సీఐ పి.వీరబాబు, పట్టణ ఎస్ఐ ప్రభాకరరావు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనం ఢీకొని బాలునికి గాయాలు

ఉప్పలగుప్తం: ద్విచక్ర వాహనం ఢీకొని బాలునికి గాయాలైన ఘటన మండలంలోని గొల్లవిల్లి గ్రామంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గొల్లవిల్లి గ్రామానికి చెందిన సలాది మణికంఠ అనే 8 ఏళ్ల బాలుడు గ్రామంలోని ప్రధాన రహదారి దాటుతుండగా అమలాపురం వైపు వెళ్తున్న ద్విచక్ర వాహనం ఢీకొని తీవ్ర గాయాలపాలయ్యాడు. బాలుడిని అమలాపురం ఆసుపత్రికి తీసుకెళ్లగా అక్కడి వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం కాకినాడ తరలించి చికిత్స అందిస్తున్నారు.

అవగాహన పెంచుకుంటే అధిక లాభాలు

అల్లవరం: పశువుల యాజమాన్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పాడి రైతులు అవగాహన పెంచుకుంటే అధిక లాభాలు ఆర్జించాలని ఏడీ విజయారెడ్డి అన్నారు. ఎంట్రుకోన పంచాయతీలో సర్పంచ్ తిక్కిరెడ్డి శ్రీనివాసరావు అధ్యక్షతన పశు విజ్ఞాన బడిపై మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీ విజయారెడ్డి మాట్లాడుతూ సరైన యాజమాన్య పద్ధతులు పాటించకపోవడం వల్లే 20 శాతం దూడలకు మరణాలు సంభవిస్తున్నాయన్నారు. దూడ పుట్టిన 2 గంటలలోపు జున్నుపాలు తాగించడం ద్వారా రోగ నిరోధక శక్తి పెరిగి వ్యాధుల బారిన పడకుండా ఉంటాయన్నారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి నారాయణరావు, సహాయకులు మౌనిక, రైతులు పాల్గొన్నారు.

పారదర్శకంగా ఓటరు జాబితా సవరణ



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో వసంతరాయుడు

అమలాపురం రూరల్: అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గంలో అత్యంత పారదర్శకంగా ఓటరు జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణ–2024 సాగుతోందని ఆర్డీవో ఎన్ఎస్‌వీబీ వసంతరాయుడు తెలిపారు. మంగళవారం స్థానిక ఆర్డీవో కార్యాలయంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బండారులంకలో మూడు పోలింగ్ కేంద్రాల లొకేషన్ల మార్పు చేపట్టినట్లు తెలిపారు. నల్లమిల్లి, అమలాపురం మున్సిపాలిటీలో రెండు, వన్నె చింతలపూడి, ఎన్.కొత్తపల్లిలో ఐదు పోలింగ్ కేంద్రాల పేర్ల మార్పుకు ప్రతిపాదించామన్నారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు బూత్ స్థాయి ఏజెంట్ల నియామకాలకు సంబంధించి పెండింగ్ లేకుండా చూడాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్లు పరమట శ్రీపల్లవి, ప్రసాద్, పట్టణ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు సంసాని చంద్రశేఖర్, పి.శ్రీనివాస్, బడుగు సత్యనారాయణ, కారెం వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సాంకేతిక విద్యతో ఉపాధి అవకాశాలు



సీఎం రంగసామి చేతుల మీదుగా సర్టిఫికెట్ అందుకుంటున్న విద్యార్థి

యానాం: సాంకేతిక విద్యా కోర్సులు అభ్యసించడం ద్వారా స్వయం ఉపాధితో పాటు వివిధ సంస్థల్లో ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని పుదుచ్చేరి సీఎం రంగసామి పేర్కొన్నారు. మంగళవారం పుదుచ్చేరి డైరెక్టరేట్ ఆఫ్ ట్రైనింగ్, కార్మికశాఖ ఆధ్వర్యంలో పుదుచ్చేరి కంబన్ కళైరంగంలో పుదుచ్చేరి రాష్ట్రంలోని నాలుగు రీజియన్‌లకు చెందిన ఐటీఐలలో అభ్యసించి ఉత్తీర్ణులైన ఎన్‌సీవీటీ ట్రేడు విద్యార్థులకు సర్టిఫికెట్‌లను అందజేశారు. ఈ సందర్భంగా యానాం నేతాజీ సుభాష్ చంద్రబోస్ ప్రభుత్వ ఐటీఐ నుంచి 11 మంది విద్యార్థులు సీఎం రంగసామి చేతుల మీదుగా సర్టిఫికెట్‌లను అందుకున్నారు. కార్యక్రమంలో కార్మిక మంత్రి చంద్రికాప్రియాంక, డాక్టర్ ఎ.ముత్తమ్మ, యానాం ఐటీఐ ఇన్‌స్ట్రక్టర్ లంక ప్రసాదరావు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లోనూ సత్తా చాటాలి

- ఎమ్మెల్సీలు సూర్యనారాయణరావు, వెంకటేశ్వరరావు



క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీలు సూర్యనారాయణరావు, వెంకటేశ్వరరావు

అమలాపురం టౌన్: విద్యార్థులు చదువుల్లో ప్రతిభ చాటుతూనే క్రీడల్లోనూ సత్తా చాటాలని ఎమ్మెల్సీలు కుడుపూడి సూర్యనారాయణరావు, ఇళ్ల వెంకటేశ్వరరావులు అన్నారు. స్థానిక జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో మంగళవారం జరిగిన నియోజక వర్గ స్థాయి క్రీడలు, ఎంపికలను ఎమ్మెల్సీలు ప్రారంభించి ప్రసంగించారు. నియోజకవర్గంలోని అమలాపురం రూరల్, అల్లవరం, ఉప్పలగుప్తం మండలాలకు చెందిన దాదాపు 60 పాఠశాలలకు చెందిన క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు మాట్లాడుతూ పాఠశాలల్లో విద్యార్థులకు చదువుతో పాటు క్రీడల్లోనూ గట్టి పునాది ఉంటే భవిష్యత్తుకు ఎంతో మేలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో అమలాపురం జెడ్పీటీసీ సభ్యుడు పందిరి శ్రీహరి రామగోపాల్, ప్రధానోపాధ్యాయిని ఎస్.రాజరాజేశ్వరి, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు సంసాని బులినాని, పార్టీ లీగల్ సెల్ నాయకుడు కుడుపూడి త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఆయుష్మాన్ పథకంతో ఉచిత వైద్యం



ఆయుష్మాన్ భవ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీపీ శేషగిరిరావు

అల్లవరం: ఆయుష్మాన్‌భవ పథకం ద్వారా దారిద్ర రేఖకు దిగువన ఉన్న కుటుంబాల్లో ఒక్కొక్కరికి ఏడాదిలో రూ.5 లక్షల వరకూ ఉచిత వైద్యాన్ని పొందొచ్చని ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు అన్నారు. అల్లవరంలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ఆయుష్మాన్‌భవ కార్యక్రమాన్ని ఎంపీపీ శేషగిరిరావు, జెడ్పీటీసీ కొనుకు గౌతమి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సీహెచ్‌సీ సూపరింటెండెంట్ మౌనిక మాట్లాడుతూ ఆయుష్మాన్‌భవ కార్యక్రమం ద్వారా అక్టోబర్–2 వరకూ అల్లవరం సీహెచ్‌సీలో వైద్య సేవలు అందిస్తామన్నారు. సీహెచ్‌సీలో మంగళవారం జరిగిన ప్రత్యేక శిబిరంలో ఒక సాధారణ ప్రసవం, శస్త్రచికిత్స ద్వారా మూడు ప్రసవాలు చేశామన్నారు. కార్యక్రమంలో డాక్టర్ గీతిక, కొనుకు మహేష్, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

డ్రెయిన్‌లో పడి ఆవు మృతి

అమలాపురం టౌన్: స్థానిక కలెక్టరేట్ రోడ్డులో ఎస్ఎస్ నాయుడు మోడల్ కాలనీ వద్ద గల మున్సిపల్ డ్రెయిన్‌లో పడి ఓ ఆవు సోమవారం రాత్రి ప్రాణాలు విడిచింది. రాత్రి సమయం కావడంతో ఎవరూ గమనించలేదని స్థానికులు చెబుతున్నారు. మంగళవారం ఉదయం మున్సిపాలిటీ పారిశుధ్య సిబ్బంది డ్రెయిన్‌లో ఇరుక్కుని చనిపోయిన ఆవు కళేబరాన్ని ప్రొక్లెయిన్ సాయంతో బయటకు తీశారు. అది చూసినవారు అయ్యో పాపమంటూ ఆవేదన వ్యక్తం చేశారు.

నేషనల్ స్కూల్ గేమ్స్‌కు 50 మంది క్రీడాకారులు

యానాం: పుదుచ్చేరిలో ఈ నెల 20 నుంచి జరిగే 67వ నేషనల్ స్కూల్ గేమ్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొనడానికి మంగళవారం యానాం నుంచి 50 మంది క్రీడాకారులు పయనమై వెళ్లారు. అథ్లెటిక్స్, బాల్ బ్యాడ్మింటన్, బ్యాడ్మింటన్, బాస్కెట్ బాల్ , క్యారమ్స్, క్రికెట్, ఫుట్‌బాల్, హ్యాండ్‌బాల్, హాకీ, కోకో, రోలర్ స్కేటింగ్, వాలీబాల్, స్విమ్మింగ్ పోటీల్లో పాల్గొననున్నారని ఆర్గనైజింగ్ సెక్రటరీ పాము సత్యనారాయణ, లెక్చరర్ ఇన్ ఫిజికల్ ఎడ్యుకేషన్ పాలికి ప్రకాష్ తెలిపారు. సమగ్ర శిక్షా అభియాన్ ఏడీపీసీ కమిడి ప్రభాకరరావు పుదుచ్చేరి వెళుతున్న క్రీడాకారులకు పలు సూచనలిచ్చారు.

మధ్యాహ్న భోజనాన్ని రుచికరంగా అందించాలి



తూర్పులంక హైస్కూల్లో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ కృష్ణమోహన్

అల్లవరం: ప్రభుత్వ పాఠశాలల్లో జగనన్న గోరుముద్ద పథకంలో భాగంగా మధ్యాహ్న భోజనాన్ని రుచికరంగా ఉండేలా జాగ్రత్త వహించాలని ఎంపీడీఓ కృష్ణమోహన్ అన్నారు. తూర్పులంక సచివాలయం పరిధిలోని జిల్లా ఉన్నత పాఠశాలలను మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనం ఎలా ఉంటుందో విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో లైంగింక వేధింపులుంటే తన దృష్టికి నేరుగా తీసుకురావాలన్నారు. గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఆర్బీకే, వెల్‌నెస్ కేంద్రాలను, అంగన్‌వాడీ కేంద్రాల పనితీరుని పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వెంట సర్పంచ్ కడలి గంగాచలం, జేఈ సంపన్, హెచ్ఎం మల్లపరాజు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వేదాల అధ్యయనంతో మానవాళికి మేలు




ఇంజరం వేద సభలో మాట్లాడుతున్న చిర్రావూరి శ్రీరామశర్మ

తాళ్లరేవు: వేదాల అధ్యయనంతో మానవాళికి ఎంతో మేలు జరుగుతుందని శ్రీరామతత్వజ్ఞ, వాచస్పతి అవార్డు గ్రహీత బ్రహ్మశ్రీ చిర్రావూరి శ్రీరామశర్మ అన్నారు. మంగళవారం ఇంజరంలోని రుక్మిణీ సత్యభామ సమేత విజయగోపాలస్వామి ఆలయంలో వేదసభ నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన శ్రీరామశర్మ మాట్లాడుతూ వేదాలకు పుట్టినిల్లు అయిన మన భారత దేశంలో వాటిని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందన్నారు. ఈ సందర్భంగా సుమారు 60 మంది వేద పండితులను దుశ్సాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఆర్షసేవా సమితి వ్యవస్థాపకులు తాతపూడి రామకృష్ణావధానులు, వేదపండితులు దువ్వూరి సూర్యప్రకాశ అవధానులు తదితరులు ప్రసంగించారు.

నేడు గోడితిప్పలో గడప గడపకూ..

అల్లవరం: మండలంలోని గోడితిప్పలో రాష్ట్ర రవాణా శాఖ మంత్రి విశ్వరూప్ తనయుడు పినిపే శ్రీకాంత్ బుధవారం గడప గడపకూ మన ప్రభుత్వం నిర్వహించనున్నట్లు మండల పార్టీ అధ్యక్షుడు కొనుకు బాపూజీ, ఎంపీడీఓ కృష్ణమోహన్ మంగళవారం తెలిపారు.

మత్స్యకారులకు నష్ట పరిహారం చెల్లించాలి



పరిహారం పంపిణీ చేయాలంటూ ధర్నా నిర్వహిస్తున్న మత్స్యకారులు

యానాం: ఓఎన్‌జీసీ సంస్థ మత్స్యకారులకు నష్ట పరిహారం నిమిత్తం చెల్లించిన రూ.75 కోట్ల సొమ్మును పుదుచ్చేరి ప్రభుత్వం తక్షణమే వారికి అందజేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం స్థానిక ఆర్ఏఓ ఆఫీసు వద్ద మత్స్యకార నాయకుడు, బ్లాక్ కాంగ్రెస్ పార్టీ నేత మల్లాడి సత్తిబాబు ఆధ్వర్యంలో భారీ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓఎన్‌జీసీ సంస్థ అందించిన సొమ్ము పుదుచ్చేరి ప్రభుత్వం తమ వద్దే ఉంచుకోవడం సరికాదన్నారు. అనవసరమైన నిబంధనలు పెట్టి కాలయాపన చేయడం ఆపి తక్షణం వడ్డీతో సహా బాధిత మత్స్యకారులకు చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఇన్‌చార్జి ఆర్ఏఓ ప్రకాశంకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు అర్థాని దినేష్, దవులూరి పతి, మల్లాడి బీరాస్వామి, పెసింగి రాంబాబు, లంకే జాన్, ధూళిపూడి మధు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి చెస్ పోటీల్లో ప్రతిభ



రిష్యేంద్రనాథ్ రెడ్డి

యానాం: యానాం జవహర్‌నవోదయ విద్యాలయ విద్యార్థి జాతీయ స్థాయి చెస్ పోటీల్లో అసాధారణ ప్రతిభ కనబరిచాడని మంగళవారం ప్రిన్సిపాల్ టీవీఎస్ ప్రకాశరావు తెలిపారు. మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్‌లో జరిగిన అఖిల భారత స్థాయి నవోదయ విద్యాలయాల చదరంగం పోటీల్లో అండర్–17 విభాగంలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థి సీహెచ్ రిష్యేంద్రనాథ్ రెడ్డి స్వర్ణ పతకం గెలుచుకున్నాడన్నారు. నవంబర్ నెలలో జరిగే ఎస్‌జీఎఫ్ఐ పోటీలకు సైతం అర్హత సాధించాడన్నారు. ఈ సందర్భంగా రిష్యేంద్రనాథ్‌ను ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు అభినందించారు.